

## చల్లనిగాలులు నడుమ..

# గరుడునిపై మలయప్ప

తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి:
కార్తీక పౌర్ణమి ఘడియల్లో...చల్లనిగాలులు వీస్తుండగా శ్రీవేంకటేశ్వరుడు తనకిష్టమైన గరుడుని వాహనంగా చేసుకుని దివ్యమైన మంగళరూపంలో గురువారం రాత్రి భక్తులను కటాక్షించాడు. పౌర్ణమివేళ గరుడునిపై మలయప్ప విహరించారు. రాత్రి 7గంటలకు వాహనమండపంవద్ద గరుడ వాహనాన్ని అధిరోహింప జేసిన అర్చకులు వేదఘోష్టితో కర్పూర హారతులిచ్చారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి , డిప్యూటీ ఇఓ హరీంధ్రనాథ్ పాల్గోన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ఎన్నికలకు ముందే రాజకీయం షురూ!



- జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతల విమర్శలు.. ప్రతివిమర్శలు
- పట్టుకోసం అధికార పార్టీ నేతలు వ్యూహం
- సత్తా చాటేందుకు ప్రతిపక్ష టిడిపి తంటాలు

ప్రభాతవార్త–తిరుపతి:
ఉమ్మడి చిత్తూరుజిల్లాలో అధికార పార్టీ నేతల విమర్శలు, ప్రతిపక్ష పార్టీ నాయకుల ప్రతి విమర్శలతో ఎన్నికలకు ముందే రాజకీయ వాతావరణం మొదలైంది. పథకం ప్రకారం 2024లో ఎన్నికలు జరగాల్సి ఉన్నా ముందస్తుగా ఎన్నికలు జరిగినా ఎదుర్కోవడానికి అధికార వైసిపి నేతలు వ్యూహాలు రచిస్తుండగా, ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ నేతలు ఎలాగైనా మెజార్టీ స్థానాలు గెలుచుకోవాలని తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో అధికారపార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగిలిన చోట్ల ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే గడపగడప కార్యక్రమం పేరుతో ప్రజలకు చేరువయ్యారు. గత మూడున్నరేళ్ళలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో మళ్ళీ తమ సత్తాచాటేందుకు వ్యూహాత్మకంగా పనిచేస్తున్నారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కొన్ని చోట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు పెదవివిరుస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, కనీసం కొన్ని చిన్నచిన్న పనులు కూడా చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారనే వ్యాఖ్యలు లేకపోలేదు. తాజాగా వైసిపి నిర్వహించిన జయహో బిసి బహిరంగ సభపై అటు అధికారపార్టీ, ఇటు ప్రతిపక్ష పార్టీల నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు ప్రతివిమర్శలకు దిగారు. ఏకంగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తిరుపతిలో చంద్రబాబుపై చేసిన విమర్శలపై టిడిపి కేడర్ నేతలు పెద్దగా పట్టించుకోలేదనే వ్యాఖ్యలు గుప్పుమంటున్నాయి. కనీసం నిజానిజాలు ప్రజలకు తెలిసేలా కూడా టిడిపి నోరుమెదపలేదనే అక్కసు కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి ఇన్‌ఛార్జిలు ఉన్న నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు కలిసి పనిచేయడం లేదనే విమర్శలు కార్యకర్తల్లో బలంగా వినిపిస్తున్నాయి. చిత్తూరు, జిడి నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలు కూడా కరువయ్యారనేది ఆ పార్టీ వర్గాల వాదన. ఇక తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి,పలమనేరు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలు ఉన్నా ఒకరిద్దరు మినహా పార్టీశ్రేణులను, కార్యకర్తలను కలుపుకుని పనిచేయడంలో కొంత స్తబ్ధత ఉందని పార్టీ కార్యకర్తలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే బాదుడే బాదుడు కార్యక్రమం పేరుతో టిడిపి నేతలు తమతమ నియోజకవర్గాల్లో ప్రజలకు చేరువగా వెళుతున్నా ఎంతవరకు ఓటుబ్యాంకు వుంటుందనేది అంచనా వేయలేకపోతున్నారు. ఇదే సమయంలో అధికార పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టడంలో, ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో టిడిపి పూర్తిగా విఫలమైందనే వ్యాఖ్యలు ప్రజల్లో బలంగా ఉంది. ఈ నేపధ్యంలో చంద్రబాబు సొంత జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎన్నికల నాటికి ప్రజల్లో పట్టుకోసం తంటాలు పడకతప్పదనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో చాలా వరకు రానున్న ఎన్నికల్లో అధికార పార్టీని ఎదుర్కొని ప్రజల మనస్సులను చూరగొనే నాయకులు ఎవరనేది ఆ పార్టీలోనే విస్మయం కలిగిస్తోంది.

# బాధితులకు ప్రభుత్వం అండ

**మృతి చెందిన ఒకొక్కరికి రూ.5 లక్షలు తక్షణ సహాయం**
**పూతలపట్టు ఎమ్మెల్యే ఒకొక్కరికి రూ.25 వేలు సహాయం**
**తీవ్రంగా గాయపడిన ఒకొక్కరికి రూ.1 లక్ష సహాయంకు చర్యలు**
**బాధిత కుటుంబాలను పరామర్శించిన డిప్యూటీ సిఎం నారాయణస్వామి**



ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, డిసెంబర్ 8 ప్రభాతవార్త:
పూతలపట్టు–కాణిపాకం రహదారిలో పూతలపట్టు మండలం లక్ష్మయ్యఊరు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను గురువారం డిప్యూటీ సిఎం నారాయణ స్వామి పరామర్శించారు. లక్ష్మయ్యఊరు గ్రామ సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడటంతో పెళ్ళికి వెళ్తున్న వారిలో 6 మంది మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆరుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ విషయం బుధవారం రాత్రి తనకు తెలిసిందని,అప్పటికప్పుడే సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన తక్షణం స్పందించి మృతి చెందిన ఒకొక్కరికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ హరినారాయణన్‌ను ఆదేశించారని డిప్యూటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. అలాగే పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒకొక్కరికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారన్నారు. అలాగే ఆరుగురి మృత దేహాలకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు.అక్కడికి చేరుకొన్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబులు మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతదేహాలను వారి స్వగృహాలకు తీసుకెళ్ళిపోవడంతో డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఐరాల మండలం మోటకాంపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ సురేంద్రరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బలిజపల్లిలో మృతురాలు వసంతమ్మ కుటుంబ సభ్యులను డిప్యూటీ సిఎం నారాయణస్వామి, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబులు పరామర్శించి మనోధైర్యం నింపారు. అనంతరం డిప్యూటీ సిఎం తవణంపల్లి మండలం తెల్లగుండ్లపల్లిలో మృతి చెందిన గుణశేఖర్ భార్య తేజ, పిల్లలు వినీషాశ్రీ, దేశాశ్రీల మృతదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే చిత్తూరు మురకంబట్టు గ్రామంలో ఈ ప్రమాదంలో మృతి చెందిన రెడ్డమ్మ మృతదేహానికి డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం : వైద్యాధికారులకు డిప్యూటీ సిఎం ఆదేశం

చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబులు పరామర్శించారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యాధికారులను డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, చిత్తూరు, తవణంపల్లి మండల తహసిల్దార్లు పార్వతి, సుశీలాదేవి, అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష కేంద్రం సమీపంలో

# తుపాను వాతావరణం

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 8 ప్రభాతవార్త
భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్‌ధవన్ స్పేస్‌సెంటర్ షార్ పరిసర ప్రాంతాల్లో మాండూస్ తుపాను వాతావరణం కనిపిస్తోంది. గురువారం సాయంత్రానికి ఈ ప్రాంతంలో పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకొని వాతావరణం భయపెడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం ఏపీలోని దక్షిణ తీరప్రాంతంపైనే ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు. అటు తమిళనాడు ఉత్తరప్రాంతాన్ని కూడా ఆ రాష్ట్రప్రభుత్వం అప్రమత్తం చేసింది. శ్రీహరికోట సమీపంలో తీరం దాటుతుందని కొన్ని మీడియా ఛానళ్లు ప్రసారం చేయడంతో షార్ పరిసర ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తం అయ్యారు. దీనికి తగ్గట్లు పులికాట్ దీవుల్లోనూ గత మూడు రోజులుగా రెవెన్యూ అధికారులు పర్యటించారు. షార్‌కు దగ్గరలో ఉన్న కొరిడి, కొల్లపట్టు, దామరాయ, పేర్నాడు దీవుల్లోనూ, ఇటు వేనాడు, ఇరకం దీవుల్లోనూ సూళ్లూరుపేట, తడ మండలాల రెవెన్యూ సిబ్బంది పర్యటించి తుపాను జాగ్రత్తలు తెలియజేశారు. దీనికితోడు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరప్రాంతాలకు చెందిన జిల్లాల కలెక్టర్లతో తుపాను గురించి మాట్లాడారు. గురువారం సాయంత్రానికి చెన్నై, కారైకల్ మధ్యలో మాండూస్ కేంద్రీకృతమై ఉందని, 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రాల వారు హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు.

### ఇఓఎస్ 06 చిత్రించిన మాండూస్ తుపాను గమనం



శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి నవంబర్ 26న పిఎస్‌ఎల్‌వి సి–54 రాకెట్ ద్వారా అంతరిక్షంలో ప్రవేశపెట్టిన ఇఓఎస్–06 ఉపగ్రహం ప్రస్తుతం దక్షిణ భారతాన్ని కలవరపెడుతున్న మాండూస్ తుపాను గమనాన్ని పసిగట్టింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో గురువారం సాయంత్రం ఈ మేరకు ఒక ప్రకటన చేసి ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. ఈ ఉపగ్రహంలోని ఓషియన్ కలర్ మానిటర్ (ఓసిఎం) పరికరం ఈ డేటాను ఇస్రోకు అందించింది. తీరప్రాంతంలోని అర్జంటీనా సమీపంలో సౌత్ అట్లాంటిక్ వద్ద తుపాను గమనం ఛాయాచిత్రాలను ఈ ఉపగ్రహం చిత్రీకరించింది. ప్రస్తుతం తుపాను గమనాన్ని శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## గేట్ పుత్తూరుకు

# అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయిస్తా

**రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా**



పుత్తూరు, డిసెంబరు 8 ప్రభాతవార్త :
స్థానిక ద్రౌపదిదేవి గుడి వద్ద గేట్‌పుత్తూరుకు వెళ్లే మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. గేట్‌పుత్తూరు నుంచి పట్టణంలోకి వచ్చే మార్గాన్ని రైల్వే శాఖాధికారులు బుధవారం మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి రోజా గురువారం సంఘటనా స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. అరక్కోణం నుంచి వచ్చిన రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ హరిబాబుకు సమస్య వివరించారు. గేట్‌పుత్తూరు వాసులే కాకుండా సుమారు 20 గ్రామాల ప్రజలకు అండర్ బ్రిడ్జి వల్ల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. దీనిపై ఇప్పటికే తాను సదరన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చానని తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నాయకులు ప్రజల సమస్యను రాజకీయం చేయాలనుకోవడం దురదృష్టకరమన్నారు. తాను అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా అందులో రెండున్నర సంవత్సరాలు కరోనా వల్ల ఏ పనులు సక్రమంగా జరగలేదన్నారు. నగరి నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ. 100 కోట్ల మేరకు రైల్వే అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. ఏకాంబరకుప్పం అండర్ బ్రిడ్జి నిర్మాణంపై కూడా రాజకీయం చేసి నిలిపివేయించారని, అయినా అడ్డంకులు తొలగించి త్వరలోనే అక్కడ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. తర్వాత పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలో ఆధునికీకరించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అలాగే మునిసిపల్ కార్యాలయంలో 37 లక్షల విలువైన జెసిబిని, ఆరో వార్డులో 25 లక్షల విలువైన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే వాసవీనగర్‌లో 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాష్ (చిట్టి), శంకర్, తదితర నాయకులు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ రోడ్లపై పురోగతి ఉండాలి

**మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ**



తిరుపతి, డిసెంబరు 8 ప్రభాతవార్త :
తిరుపతి నగరాభివృద్ధికి చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల్లో పురోగతి వుండేలా అధికారులు కృషి చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశంలో మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రత్యక్షంగా పాల్గొనగా, జూమ్ మీటింగ్ ద్వారా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి తోనే నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందనే ప్రణాళికతో కౌన్సిల్ ఆమోదంతో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రజలతో కలసి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గాంధీ విగ్రహం పక్క నుండి గంగమ్మ గుడివైపుకు వెళుతున్న రోడ్డును ఏరియా అభివృద్ధిలో భాగంగా వెడల్పుచేసే ప్రక్రియను త్వరితంగా పూర్తి చేసేందుకు ప్లానింగ్ సిబ్బంది మార్కింగ్ పనులను పూర్తిచేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి సమావేశంలోని అధికారులతో మాట్లాడుతూ రోడ్ల వెడల్పుకు తమ స్థలాలను ఇస్తున్న యజమానులకు మున్సిపల్ కార్పొరేషన్ తరపున టిడిఆర్ బాండ్లను త్వరితగతిన అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ సిటి ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్లానింగ్ సెక్రటరీలు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్,ఆంజనేయులు, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, వంశీ, చింతలచేను గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆభా కార్డుల నమోదు శాతాన్ని పెంచాలి

**-కలెక్టర్ వెంకట రమణారెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:
జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు వేగవంతం చేయాలని, ఇప్పటివరకు 47శాతం మాత్రమే నమోదైయిందని, నమోదు శాతాన్ని పెంచాలని వైద్య అధికారులను కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం అమరావతి నుండి వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుండి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి. డికె.బాలాజీ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకట రమణారెడ్డి జిల్లా వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 238 మంది హై రిస్క్ గర్భిణీలు ఉన్నారని, వారి పర్యవేక్షణ, మందులు, ఆహార నియమాలు ప్రత్యేకంగా వైద్య బృందం చూడాలన్నారు. జిల్లాలో 1,87,076 కుటుంబాలు ఉంటే ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు 47శాతం మాత్రమే చేపట్టారని త్వరలో పూర్తి చేసే దిశగా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా 437 గ్రామాలలో పర్యటించి 39,377 మందికి వైద్య సేవలు అందించారని, వీరి డేటా పూర్తిగా ఆయుష్మాన్ భారత్‌లో కావాలని, అప్పుడే దేశ వ్యాప్తంగా మెడికల్ రికార్డు అందుబాటులో ఉంటుందని, ఇది పేదలకు సహాయపడుతుందని సూచించారు. జిల్లాలో వైయస్సార్ హెల్త్ క్లీనిక్‌లు 387కుగాను ఇంకా 91 నిర్మాణాలు ప్రారంభం కాలేదని, రూ.3.3లక్షలు అదనంగా మంజూరు చేయడం జరుగుతుందని, కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించి పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ సర్వే లక్ష్యం మేరకు ఈనెల 15 నాటికి పూర్తి కావాలన్నారు. వైద్యశాఖ ముఖ హాజరు శాతం చాలా తక్కువుగా ఉందని, వందశాతం నమోదు కావాలన్నారు. ఈ సమావేశంలో డి.ఎం.అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఇ.పి.దేవి పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు

8/12/2022



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

## బంగారం ధరలు

8/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,016

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,472

## కోడిగ్రుడ్ల ధరలు

8/12/2022



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

# ఏడుగంగమ్మల జాతరకు

# దక్షిణకైలాసం ముస్తాబు

## 11న జాతర చాటింపు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :
ఓ వైపు తుఫాను ప్రకటనలు దడపుట్టిస్తుంటే మరో వైపు జారత కమిటిలు ఏర్పాట్లులో తలమునకలై ఉన్నారు.ఈ నెల 11 రాత్రి చాటింపు కార్యక్రమాలకు సిద్ధం చేస్తున్నారు. ముత్యాలమ్మగుడివీధిలో గురువారం విద్యుత్ శాఖ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు.ఇప్పటికే ఏడుగంగమ్మలు నిల్చు స్థలంలో కన్నులు మిరుమిట్లు కొల్పొనట్లు ముస్తాబు చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర అత్యంత వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 13,14వ తేదీల్లో ఏడుగంగమ్మల జాతర జరుగుతుంది. ఎక్కడైనా జాతరలు వేసవికాలంలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతరను శీతాకాలంలో డిసెంబర్ మొదటి, లేదా రెండో వారంలో నిర్వహించడం ప్రత్యేకత. అంతేకాక జాతర అంటే మూలస్థానంలో అమ్మవారిని కొలువుదీర్చి పూజలు నిర్వహించి సంబరాలు నిర్వహించుకోవడం జరుగుతుంది. అయితే గంగాజటాధరుడు కొలువుదీరిన దక్షిణకైలాసంలో గంగమ్మతల్లి ఏడు రూపాలుగా భక్తులకు దర్శనమిస్తూ ఏడు ప్రాంతాల్లో కొలువుదీరి భక్తజన కొంగుబంగారంగా భాసిల్లుతూ కోరిన కోర్కెలుతీర్చే అమ్మవారిగా విశ్వరూపిణిగా దర్శనమివ్వడం ఈ ఏడుగంగమ్మల జాతర ప్రత్యేకత. జాతరను ఆయా జాతర కమిటీలు ఏర్పడి పోటా పోటీగా గంగమ్మలను అలంకరించేందుకు చర్యలుతీసుకుంటు న్నారు. ఆయా జాతర కమిటీల ఆధ్వర్యంలో తమ తమ గంగమ్మలను ప్రత్యేకంగా విభిన్నంగా ఉండేలా భక్తులను ఆకట్టుకునేలా చేసేందుకు అమ్మవారి వాహనాలను రూపుదిద్దుతున్నారు.

**జాతర చాటింపు:**
ఏడుగంగమ్మల జాతర సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలో చాటింపు వేయనున్నారు. గంగమ్మ ఆలయంలోను మరియు ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం నగరివీధిలో ఉన్న తెట్టురాయి వద్ద పూజలు జరిపి కుంభం వేసే కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.. అనంతరం పట్టణ పురవీధుల్లో జాతర చాటింపును సంప్రదాయ పద్దతుల్లో నిర్వహిస్తారు.



ఏడుగంగమ్మల ఆలయంలో అలంకరణ చేపట్టిన దృశ్యం(ఫైల్‌ఫోటో)

## అన్ని వర్గాల వారికి వైకాపా ప్రభుత్వం సమన్యాయం : మంత్రి

సదుం,డిసెంబర్ 8 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆద్వర్యంలో నడుస్తున్న వైకాపా ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతున్నట్లు మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.గురువారం ఆయన తిరుపతిలోఅయ్యప్పమాల వేసుకుని సదుం యర్రాతి వారిపల్లెలోనిఅయ్యప్పఆలయానికివిచ్చేశారు. ఈసందర్బంగాఆలయంలోనివినాయక,ఆంజనేయ, నాగమళ్లే శ్వర,నవగ్రహ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కంభంవారిపల్లె పంచాయతీ గూబలవారిపల్లెకు చెందిన ధనంజయకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.1.40లక్షలు చెక్కును మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మంత్రి పిఏలు మురళీకృష్ణారెడ్డి, మునితుకారం, వైకాపా నాయకులు సీపీ సుబ్బారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, యండపల్లె మనోహరరెడ్డి,పుత్రాజు, సీఐ మధుసూధనరెడ్డి,సోమల ఎస్సై లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో స్థానిక నేతల పాత్ర

సదుం,డిసెంబర్ 8 ప్రభాతవార్త:

గ్రామాల అబివృద్ధిలో స్థానిక నేతల పాత్ర అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ ఎల్లప్ప అన్నారు. గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారు చేయడంపై సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బందికి సదుంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కల్లూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త:



మండల పరిదిలో పాఠశాలలో ఆడుకుంటు ప్రమాదవశాత్తు పడి గాయాలపాలై చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారి వాండ్లపల్లె కు చెందిన రాజేంద్ర కుమారుడు జయకృష్ణ(11) కల్లూరు జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజుల క్రితం తోటి పిల్లలతోకలిసి ఆడుకుంటుండగా జారిపడ్డాడు. ఈఘటనలో అతనికి పైకి కనపడని దెబ్బలు తగిలాయి. కుటుంబ సభ్యులు కల్లూరులో వైద్యశాలల్లో చూపించారు. అనంతరం రెండు రోజులు పాఠశాలకు వెళ్లాడు. మళ్లీ తలనొప్పిగా ఉందని చెప్పడంతో ఇటీవల తిరుపతి రూయా వైద్యశాలలో చూపించారు. అక్కడ డాక్టర్లు తలలో సమస్య ఉందని పెద్ద వైద్యశాలకు తీసుకువెళ్లమని సూచించారు. దీనితో అతన్ని చెన్నైలోని వైద్యశాలకుతీసుకువెళ్లి చికిత్సచేయించారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థి గత రాత్రి మృతి చెందాడు.

## కన్నుల పండువగా కల్యాణోత్సవం

కల్లూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త:

పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్బంగా స్వామి వారికి కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్బంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు ఆద్వర్యంలో వేదమంత్రాలతో లక్ష్మి నరసింహస్వామి వార్ల కళ్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

## నేడు సీజ్ చేసిన వాహనాల వేలం

శాంతిపురం, డిసెంబర్ 8 ప్రభావార్త :

వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 17 టువీలర్లు, రెండుకార్లు, ఒక ఆటోను జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో బహిరంగవేలం వేస్తున్నట్లు ఎస్సై మునస్వామి తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

## మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందించాలి

కుప్పం, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



కుప్పం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే యూనిఫాం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం కుప్పంలో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20,21 తేదీల్లో అనంతపురంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నేతలు పార్తీబన్, గోవిందరాజులు, సిఐటియు నేత దేవిడ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడు కలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ నూకా వెంకట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృ తాభిషేకం నిర్వహించి పూజలు చేసి ధూప దీప నైవేద్యాలనుసమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలురకాలసాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఆలయ ఛైర్మన్ పి.సురేం ద్రారెడ్డి, ఈఓ సుబ్బారెడ్డి,పాలకమండలి సభ్యులు,అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పొలం బడిపై రైతులకు అవగాహన కల్పించడండి : డిడిఏ

పలమనేరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త:



పొలం బడి కార్యక్రమాలపై మండల స్థాయిలో రైతులకు మండలవ్యవసాయ అధికారులు,రైతు భరోసా కేంద్ర సిబ్బందికి జిల్లా వనరుల కేంద్రం డిడిఏ గోపాల్, ఏడిఏ అన్నపూర్ణాదేవి సూచించారు.స్థానిక స్త్రీ శక్తి భవనంలో గురువారం పలమనేరు డివిజన్ పరిధిలోని పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడిపాల్లె వ్యవసాయ అధికారులకు,రైతు భరోసా కేంద్ర సిబ్బందికి జిఏపిసర్టిఫికేషన్‌శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 7 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి గెలుపుతోనే రాష్ట్రష అభివృద్ధి

పలమనేరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త:



టిడిపి గెలుపుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు.గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మున్సిపాలటీలోని 26వ వార్డులో టిడిపి నాయకులు పర్యటించారు. ఈ మేరకు ప్రజలతో వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికలో టిడిపి గెలుపొందాలని తెలిపారు. రాష్ట్ర, యువత భవిష్యతు కోసం ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్బిసి కుట్టి,గిరిబాబు,సుబ్రమణ్యం గౌడ్,నాగరాజు,సుధాకర్, మధన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్ దంపతులపై..ఇసుకాసురులు దాడి!

గంగవరం, డిసెంబరు 8, ప్రభాతవార్త :



వాలంటీర్ దంపతులుపై ఇసుకాసులు బరితెగించి దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.దాడిలో గాయపడ్డ వాలంటీర్ దంపతులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా..మండలంలోని కలగటూరు గ్రామానికి చెందిన పవిత్ర(24)అనే యువతి కలగటూరు పంచాయతీ పరిధిలోని సచివాలయం నందు గ్రామ వాలంటీర్‌గా పని చేస్తుంది.పవిత్ర ఆమె భర్త భాస్కర్ గ్రామ సమీపంలోని కౌండిన్య నది పక్కన వారికి చెందిన వ్యవసాయ పొలంలో జొన్న పంటను పండించుకోవడానికి పొలంను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన అచ్చమ్మెాల్ల కేశవులరెడ్డి అనే వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా స్థానిక కౌండిన్య నది నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ వాలంటీర్ దంపతులు తమ పొలం పక్కన ఆపి ఉన్న తమ ద్విచక్రవాహనాన్ని ఇసుక ట్రాక్టర్‌తో అతి వేగంగా వచ్చి డీకొట్టి ధ్వంసం చేసి వెళ్ళిపోవడంతో వాలంటీర్ పవిత్ర ఆమె భర్త ఇద్దరు కలసి వెళ్ళి ఇసుక ట్రాక్టర్ డీకొట్టడంతో తమ ద్విచక్రవాహనం ధ్వంసమైందని కేశవరెడ్డిని అడుగగా దీంతో ఆగ్రహించిన కేశవులరెడ్డితో పాటు పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగకు చెందిన మరో ట్రాక్టర్ డ్రైవర్ వేణు మరి కొందరు ఇసుకాసురులు బరితెగించి తమపై దాడి చేసి తీవ్రంగా గాయపరచారని,వాహనాన్నే కాదు మిమ్మల్ని ఢీ కొట్టి చంపితే మీ వల్ల ఏమవుతుందని దంపతులను నానా దుర్భాషలాడి విచక్షణ రహితంగా చితకబాది తీవ్రంగా గాయపరచారని బాధితులు విలపించారు. తమపై అకారణంగా దాడి చేసిన ఇసుకాసులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలంటూ వాలంటీర్ దంపతులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కుప్పం, డిసెంబర్ 8 ప్రభాతవార్త :

మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై శుక్రవారంస్థానిక మండల కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమంను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జానకమ్మ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంకు ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహరించండి : ఎంపిపి అనిత

గంగాధర నెల్లూరు డిసెంబరు 8 ప్రభాత వార్త:



గ్రామ పంచాయతీల అభివృద్ధికి మండల గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని ఎంపిపిఅనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశపు హాలులో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళిక ఏర్పాటుపై ఓ రోజు శిక్షణకార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిపిడిపి ద్వారా పంచాయతీ అభివృద్ధి కోసం ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని భారత రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ నందు పొందుపరచిన 29 అంశాలపై కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అలాగే జనవరి 31వ తేదీ గ్రామ పంచాయతీ స్థాయి సమావేశం ఫిబ్రవరి 28వ తేదీ మండల పరిషత్ స్థాయిలో మార్చి 31న జిల్లా పరిషత్ స్థాయిలో పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళికను సిద్ధం చేసి పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, ఎంపిడిఓ శ్రీదేవి వైయస్ ఎంపిఓ హరిబాబులతో పాటు ఈఓ ఆర్ డి శివయ్య పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మండుస్ తుఫాన్‌పైప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గంగాధర నెల్లూరు డిసెంబరు 8 ప్రభాతవార్త:

దూసుకు వస్తున్న మండుస్ తుఫాన్‌పై అధికారులు ప్రజా ప్రతినిదులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఎంపిడిఓఅన్నారు.అధికారులు మండలంలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించడంతో పాటు ప్రమాదంగా ఉన్న చెరువు కట్టలను గుర్తించాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకుతరలించాలని అన్ని శాఖల మండల స్థాయిఅధికారులు గ్రామస్థాయి అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు

## క్షతగాత్రులను పరామర్శించిన దేశం నేతలు

చిత్తూరురూరల్, డిసెంబరు 8 ప్రభాతవార్త:



పూతలపట్టు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను టిడిపి నాయకులు గురువారం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరామర్శించారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు. అలాగే గాయపడిన కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థికసహాయం అందజేయాలని చేయాలని ఆర్డీఓ వినతి చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గిరిధరబాబు, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, జిల్లా వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్‌చౌదరి, రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యక్తిగత నైపుణ్యాలే కీలకం:ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, డిసెంబరు 8 ప్రభాతవార్త:



విద్యార్థులకు వ్యక్తిగత నైపుణ్యాలే కీలకమని, శ్రమ, పట్టుదల, ఏకాగ్రతతో చదివితే అవకాశాలు మెండుగా లభిస్తుందని చిత్తూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీ బాలత్రిపుర సుందరి కళ్యాణమండపంలో గురువారం ఆర్‌కె డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డేను ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డి.కె. బద్రీనారాయణ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగం సంపాదించడంలో కమ్యూనికేషన్ స్కిల్స్ కీలకమని వాటిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆటపోటీలలో గెలుపొందిన విజేతలకు అతిధుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ రాహుల్‌రెడ్డి, సీతమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, కళాశాల అధ్యాపకబృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంకు వివిధ అభివృద్ధి పనులుకు ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. చిత్తూరుకు చెందిన చీలాపల్లె నాగేంద్రనాయుడు అనే భక్తుడు దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 50,116 రూపాయలు, శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్ పథకానికి మరో 50,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ వెంకటేశుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నరేంద్ర మోదీ పాలనను చూసే ప్రజలు పట్టం కడుతున్నారు

– నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరి, డిసెంబరు 8 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలన చూసి దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీకి పట్టం కడుతున్నట్టు ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. గుజరాత్‌లో బీజేపీ అఖండ విజయం సాధించినందుకు వెంకటగిరిలోని బిజెపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. గుజరాత్‌లో ప్రజలు కనీవినీ మెజారిటీ బీజేపీకి ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీకి 2024లో అఖండ మెజారిటీ వస్తుందన్నారు. బీజేపీ వలనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతున్నట్లు విమర్శించారు. వైసీపీ, టీడీపీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దశయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు మొండి చేసి చూపిన రాష్ట్ర ప్రభుత్వం

– రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె.వి.కె.ప్రసాద్

వెంకటగిరి, డిసెంబరు 8 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా మొండి చేయి చూపిందని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె.వి.కె.ప్రసాద్‌నాయుడు తెలిపారు. వెంకటగిరిలోని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ సంస్థ యువత పెడదోవ పడుతున్నట్లు ఆందోళన చెందారు. రాష్ట్రాల్లో అవినీతి అక్రమాలు పెరిగాయన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సుబ్బు యాదవ్, శివయ్య, చెంచయ్య, మురళీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత శిక్షణ సంస్థ పరిశీలించిన అధికారుల బృందం

వెంకటగిరి, డిసెంబరు 8 ప్రభాతవార్త:



వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ గదులను మరియు బిల్డింగులను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ క్రాఫ్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వ, ఆప్కో కన్సల్టెన్సీ నిర్మల పరిశీలించారు. వాటి అభివృద్ధి కొరకు రూ.16.5 కోట్ల అంచనాలను ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర రావు, రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు, స్థానిక కౌన్సిలర్ మాడా జానకి రామయ్య వినతిపత్రం అందజేశారు. అదే విధంగా వెంకటగిరిలోని క్రాస్ రోడ్డులో ఉన్న చేనేత భవనాన్ని మరియు గదులను సందర్శించి అక్కడ చేనేత కళాకారులు సొంతంగా చేతితో నేసిన చీరలను అమ్ముకునే విధంగా ఏర్పాటు కొరకు ఎమ్మెల్యే సూచనల మేరకు వాటి అభివృద్ధి కొరకు అంచనాలను తయారు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, ఆరో వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామయ్య, చింతగింజల సుబ్రహ్మణ్యం, శంకర్, గాజుల సుబ్రహ్మణ్యం, ఐహెచ్‌టి ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థి

దొరవారిసత్రం, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



మహాత్మా జ్యోతిబాపూలే దొరవారిసత్రం గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్రస్థాయి అండ్–19 విభాగంలో రెజ్లింగ్ పోటీల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.తిరుప తయ్య గురువారం తెలిపారు. కె.సీతారామ్ గోల్డ్‌మెడల్, లీలామోహన్ సిల్వర్ మెడల్, మణిదీప్ సిల్వర్ మెడల్‌ను సాధించారు. అందులో సీతారామ్ అనే విద్యార్థి ఈ నెల 25న ఢిల్లీలో జరిగే అండర్–19 విభాగం రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులను జోనల్ ఆఫీసర్ కె.అక్కారావు, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, పీడీ చంద్రశేఖర్, సుప్రజ, ఉపాధ్యాయులు అభినందించారు.

## కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి పరామర్శ

కోట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



కోట మండలం వెంకన్నపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ లింగుంట పరశురామయ్య ఇటీవల మృతి చెందారు. ఆ మేరకు గురువారం కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి ఆ గ్రామానికి వెళ్లి పరశురామయ్య చిత్రప టానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆమె వెంట వెంకన్నపాలెం సర్పంచ్ మధుసూదన్‌యాదవ్, గుర్రం అశోక్‌కుమార్, కోట పట్టణ అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్ ఉన్నారు.

## పోర్లుకట్టలను పరిశీలించిన స్పెషలాఫీసర్

కోట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



తుపాన్ నేపథ్యంలో కోట మండలం పుచ్చలపల్లి పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి పోర్లుకట్టలను గురువారం స్పెషలాఫీసర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ పద్మావతి పరిశీలించారు. గతంలో తుపాను, వరదల సమయంలో ఆ పోర్లు కట్టల గండ్ల నుంచి దైవాలదిబ్బ, దొరువుకట్ట ప్రాంతాల్లోని రైతుల పొలాలు జలమయం అయ్యాయి. రైతుల పొలాలు ఇసుకమేటలు వేయడంతో రైతులు కోలుకోలేని దెబ్బతగిలింది. ఆ మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు పోర్లు కట్టలను పరిశీలించారు. వారివెంట నీటిపారుదల శాఖ ఏఇ ఫరూఖ్ తదితరులు ఉన్నారు.

## కోటలో బీజేపీ సంబరాలు

కోట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



దేశంలోని రెండు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గుజరాత్‌లో ఏడోసారి బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల కోట మండల బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ బీజేపీలో మోడీ, అమిత్‌షా వ్యూహరచనతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. అందుకు నిదర్శనం గుజరాత్ ఎన్నికల్లో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఏడోసారి కూడా బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు అంబరీష్, వాసు తదితరులు ఉన్నారు.

## ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

నాయుడుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



నాయుడుపేటలోని కెఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 11న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుమార్తె సౌజన్య, శ్రావణ్‌కుమార్‌ల వివాహ రిసెప్షన్‌కు సంబంధించిన ఏర్పాట్లను నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 7వ తేదీన నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షర్ హాల్లో సౌజన్య, శ్రావణ్‌కుమార్‌ల వివాహానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌సీలు, ఇతర ముఖ్యులు హాజరై ఆశీర్వదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 11న జరగనున్న రిసెప్షన్‌కు సంబంధించిన ఏర్పాట్లను డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డితో పాటు పట్టణ సీఐ ప్రభాకర్, కమిషనర్ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కటకం జయరామయ్య, నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ రంతుల్లా, పేట చంద్రారెడ్డి, అన్నమేటి చంద్రారెడ్డి తదితరులు పరిశీలించారు.

## పేటలో మొదలైన వర్షం!

నాయుడుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :

బంగాళఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాన్ ప్రభావంతో నాయుడుపేట మండలంలో గురు వారం సాయంత్రం నుండి వర్షం పడుతుంది.మాండూస్ తుపాన్‌తో ఉదయం నుండి గ్రామాల్లో చలిగాలులు వీస్తున్నాయి.వీస్తున్న చలిగాలులకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు.ఆకాశంలో నల్లటికారుమబ్బులు కొమ్ముకొని చిమ్మచీకటి వాతావరణంను తలపిస్తూ ఈదుగాలులతో కూడిన వర్షం పడుతుంది. తుపాన్ ప్రభావంతో విపరీతంగా వీస్తున్న చలిగాలులకు ప్రజలు ఇంటినుండి బయటకురాలేక అవస్థలు పడుతున్నారు.

## తీరంలో హోరెత్తించిన గాలులు

–భారీ వర్ష సూచనలతో యంత్రాగం అప్రమత్తం

కోట,డిసెంబర్ 8 ప్రభాతవార్త :

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. ఈ నెల 8 నుంచి 10 వ తేదీ వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే.ఇప్పటికే కొన్ని మండలాల్లో వరి సాగు చివరి ధశ చేరడంతో రైతుల్లో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.కోస్తా తీర ప్రాంతం మండలాలైన కోట,వాకాడు, చిట్టమూరు, మండలాల్లో ముందస్తు సహాయక ఏర్పాట్లను గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలానికి ప్రత్యేకాధికారిని నియమించారు. వారే ప్రస్తుతం పర్యవేక్షిస్తున్నారు. ఎంపిడివోలు, తహిశీల్దార్లు కు కలెక్టరేట్ నుంచి సమాచారం అందడంతో ఆయా మండలాల్లో లోతట్టు ప్రాంతాలను ఉద్యోగులను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో క్యాదర్శులు, వీర్వోలు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లుకు సూచనలు ఇస్తున్నారు.గురువారం రాత్రి చలగాలుల తీవ్రత పెరిగింది. ఈ నెల 10 తేదీ వరకు మత్యకారుల సముద్రంలోకి వేటకు వెళ్ల వద్దను అధికారులు సమాచారం ఇచ్చారు. తీర ప్రాంత గ్రామాలల్లోని లోతట్టు ప్రాంతాలపై మండల స్దాయి అధికారులు దృష్టి సారించారు. అవసరాన్ని బట్టి పునరావస కేంద్రాలు ,ప్రభుత్వ పాఠశాలలు సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేద్రాలకు తరలించనున్నారు. బియ్యం,కందిపప్పు, ఆయా ప్రాంతాల్లోని చౌకధరల దుకాణాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశాలు అందాయి.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

– ఫిర్యాదులు అందితే తప్ప స్పందించని రెవెన్యూ యంత్రాంగం

ఓజిలి, డిసెంబర్ 8 ప్రభాతవార్త



ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారు. చివరికి చుట్టుపక్కల ఉన్న పచ్చని పంట పొలాల్లో కాలుష్యం చిచ్చు పెడుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కూడా వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టి ఆనవాలు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విలువైన భూమిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు మనవాలి గ్రామస్థులు అంటున్నారు. ఒకవైపు అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుండగా, మరోవైపు ఆ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మనవాలి గ్రామంలోని సర్వే నంబర్ 143లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ప్రజలు అంటున్నారు.

**కలుషితమైన భూగర్బ జలాలు** పరిశ్రమ కాలుష్యం కారణంగా అనేక గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. ఎర్రగా, నల్లగా, పుసుపుగా రంగుమారి నీరు వస్తోందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి జలాలతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో పంట పొలాలన్నీ పాడవుతున్నాయని అంటున్నారు. ప్రజలు, పశుసంపద పూర్తిగా ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారని పలు గ్రామాల ప్రజలు తమ గోడు వెల్లడించారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని ప్రజలు అంటున్నారు.

## నేడు సెబ్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాల వేలం

కుప్పంరూరల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త :

వివిధ సెబ్ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను శుక్రవారం కుప్పం సెబ్ స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు తమ ఆధార్, పాన్‌కార్డు నకళ్లు, జిఎస్‌టి కలిగి ఉండాలన్నారు.

## ముద్దనపల్లిలో ఇదేం ఖర్మ కార్యక్రమం

రామకుప్పం, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



మండలంలోని ముద్దనపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మరలా అధికారంలో వస్తుందని అనంతరం మండలాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నేతలు ఆంజనేయరెడ్డి, మునస్వామి, చలపతి, ఆనంద్‌రెడ్డి, నరసింహులు, చిన్నికృష్ణ, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రఘు, వెంకటాచలం, చంద్రశేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నేత మృతికి మాజీ మంత్రి సంతాపం

పెద్దపంజాణి డిసెంబర్ 8 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీని యర్ నేత నటరాజఅనారోగ్యంతోమృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రిఎన్,అమర్నాథ్‌రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని ఆయనమృతదేహానికిపూలమాలవేసినివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబంకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు ఆనంద్,చలపతి,సుధాకర్ రెడ్డి, మురహరి రెడ్డి,వేమారెడ్డి, గంగప్ప,పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ట

పెద్దపంజాణి డిసెంబర్ 8 ప్రభాతవార్త :



మండలంలోని తుర్లపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మదేవి ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టను అత్యంతవైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు హోమాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని శుభముహూర్తంలో ప్రతిష్టించి ప్రాణప్రతిష్టచేసారు.ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరుకాగా నిర్వాహకులు వారికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు కాగా తుర్లపల్లి ఎస్సీ కాలని ఏర్పాటుకు గతంలో రెండు ఎకరాల భూమి విరాళంగా అందించిన జె.సి.నాయుడు మనవడు జె.సి.నారాయణస్వామి అమ్మవారి విగ్రహప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయనను కాలనీ వాసులు,ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించి శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను, తీర్థప్రసాదాలను అందించారు.కాగా ఆలయంకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలేకాక మండలంలోని వివిధ ప్రాంతంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు.

## గుర్తు తెలియని మహిళ మృతి!



శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :

పట్టణంలోని సన్నిధివీధిలో ఉన్న జలవినాయక ఆలయం సమీపంలో 45సంవత్సరాలు ఉన్న ఓ మహిళ మృతిచెంది ఉండడం గమనించిన సిబ్బంది పోలీసులుకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు ఎర్రనిచీర, పచ్చగీతల చీర ధరించి ఉంది. మృతురాలిని ఎవరైనా గుర్తిస్తే అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

## కిశోరబాలికలకు క్రీడలపై అవగాహన

తొట్టంబేడు, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తొట్టంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిడిపిఓ ఫర్జానా మాట్లాడుతూ కిశోరా బాలికలకు క్రీడల ఆవశ్యకత, వ్యాయామంతో ఉపయోగాలు తెలిపారు. చదువుల ఒత్తిడి నుంచి క్రీడలు ఉపశమనం కలగజేసి ఉల్లాసాన్ని ఇస్తాయని అదేవిధంగా క్రీడల ద్వారా మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంఈవో భారతీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు మీనా మరియు కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సోదరుడికి సమస్యలు చెప్పకున్న వైసిపి నాయకులు

విజయపురం, డిసెంబరు 8 ప్రభాతవార్త :



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డికి మండలంలోని వైసిపి నాయకులు తమ సమస్యలు చెప్పుకున్నారు. గురువారం మండలంలోని వరదరాజుల కండ్రిగ గ్రామంలో మాజీ మండల వైసిపి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు గృహ ప్రవేశం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. మండల వైసిపి నూతన కార్యవర్గ ఏర్పాటులో పార్టీకి పటిష్టతకు కృషి చేసిన వారికి అన్యాయం జరిగిందని వాపోయారు. మండలంలో పార్టీ కార్యకలాపాలు పర్యవేక్షించాలని కోరారు. అనంతరం మహారాజపురంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ మణి తల్లి అన్నమ్మాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు గోపి, వైస్ ఎంపిపి మంజు బాలాజీ, మాజీ మండల అధ్యక్షుడు రామకృష్ణమరాజు, సర్పంచ్‌లు మురళీకృష్ణారెడ్డి, భాస్కర్‌రాజు, నాయకులు శివరాజు, రమేష్, ప్రతాప్‌రాజు, శేఖర్‌రాజు, సుధాకర్‌రాజు, జిల్లు, నారపరాజు, సునీల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను అకస్మిక తనిఖీ చేసిన ఎంపీపీ

పెద్దపంజాణి డిసెంబర్ 8 ప్రభాతవార్త :



మండలంలోని పలు సచివాలయాలను ఎంపీపీ రెడ్డెప్ప గురువారం అకస్మికంగా తనిఖీ చేసారు. పెద్దవెలగటూరు, రాజుపల్లి సచివాలయాలను అకస్మిక తనికి చేసిన ఆయన పలు రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేవిదంగా సిబ్బంది కృషిచేయాలని వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పైస్థాయి అధికారులకు తెలిపి వారి సమస్యలకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు శంకర్ రెడ్డి, విఆర్వోలు, పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను పరిస్థితులతో మరింత అప్రమత్తం

గుడిపాల, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



మాండూస్ తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం తహసిల్దారు రాజేంద్రప్రసాద్ మండలంలో ప్రమాదకరంగా వున్న వాగులు, వంకలు, చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళాలన్నారు. చెరువులు నిండితే ప్రజలు అటువైపు వెళ్ళవద్దని స్పష్టం చేశారు. అలాగే వాగులు, వంకల్లో నీటి ప్రవాహం అధికంగా వున్న సమయంలో ప్రవాహంను దాటడానికి ఎవరు ప్రయత్నించవద్దని పేర్కొన్నారు. తహసిల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎదైనా సమస్యలు వుంటే సమాచారం అందిస్తే అధికారులు స్పందించి చర్యలు తీసుకొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవులో కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

మాండూస్ తుఫాను నేపథ్యంలో ఉత్పన్నం అయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొండానికి కలెక్టర్ పై స్థాయి అధికారుల నుండి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు సెలవులను రద్దు చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ రెండు రోజుల పాటు సెలవులో వెళ్ళారు. అయితే కమీషన్ తుఫాను వల్ల ఉత్పన్నం అయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి చేపట్టాల్సిన పనులకు సంబంధించి మున్సిపల్ విభాగ అధిపతులకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసి వుండటంతో నగర పరిధిలో మున్సిపల్ అధికారులు తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి సంసిద్ధం అయ్యారు.

## నిర్ణీత కాలంలో పనులు పూర్తి

పాలసముద్రం, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

నిర్ణీత కాల పరిమితిలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని వనదుర్గాపురం సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ జయరాజు, సర్పంచ్ నరసింహరాజులను ఎంపిడిఓ విద్యావతి ఆదేశించారు. వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను ఎంపిడిఓ విద్యావతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాల పరిమితిలోపు నిర్మాణాలను పూర్తి స్థాయిలో చేపట్టి పూర్తి చేసి భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని సర్పంచ్‌ను కోరారు. ఈ మేరకు నిర్ణీత కాల వ్యవధిలో నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకొంటామని ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయరాజు, సర్పంచ్ నరసింహరాజులు ఎంపిడిఓ విద్యావతికి వివరించారు.

## ట్రాక్టర్ ప్రమాద మృతుల కుటుంబాలకు డిప్యూటీ సీఎం పరామర్శ

ఐరాల, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



పూతలపట్టు మండలం లక్ష్మయ్య వూరు సమీపంలో బుధవారం రాత్రి పెళ్ళి బృందం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతులకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, స్థానిక ఎమ్మెల్యేఎంఎస్.బాబులుగురువారం ఘనంగా నివాళుర్పించారు. ఈప్రమాదంలో మోటకంపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎ.సురేం ద్ర రెడ్డి(52), బలిజపల్లె ఎస్సీవాడకు చెందిన వసంతమ్మ(50)లు మృతి చెందిన విషయం విధితమే. వీరి మృత దేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుండి గురువారం ఉదయం వారి వారి స్వగ్రామాలకు బంధువులు తరలించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్.బాబులు మధ్యాహ్నం మోటకంపల్లె, బలిజపల్లె గ్రామాలకువెళ్ళి మృతులకు నివాళులర్పించారు. అలాగే వారి కుటుంబస భ్యులను ఓదార్చారు. మృతుల కటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా వుంటుందని తెలిపారు. అలాగే మృతులకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు వంతున సీఎం జగన్ ప్రకటించినట్లు తెలిపారు. వీరి వెంట మండల వైకాపాకన్వీనర్‌బుజ్జిరెడ్డి, నాయకులుప్రభాకర్‌రెడ్డి, స్థానికతహశీల్దార్‌సుశీల, పలువురు స్థానిక పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో స్టేట్‌బ్యాంక్, ఎస్‌బీఐని ప్రారంభించాలి

కేవీబీ పురం, డిసెంబరు 8 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో స్టేట్ బ్యాంకు బ్రాంచి ఎస్‌బీఐని వెంటనే ప్రారంభించాలని మండల కేంద్రం వాసులు, నాయకులు, అధికారులు, అనధికారులు వినియోగదారులందరూ స్థానిక తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దెల గురుమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవీబీపురంలో మండల కేంద్రం రాకముందు కోవనూరులో మండల కేంద్రం ఉండేదని కోవనూరులో మండల కేంద్రం ఏర్పడినప్పుడు కోవనూరు స్టేట్ బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేశారు. కొంత కాలం తరువాత మండల కేంద్రం 29 పంచాయతీలకు అనుకూలంగా ఉండాలన్న సదుద్దేశంతో ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు మండలాన్ని కేవీబీ పురంకు మార్పు చేశారు. మండల కేవీబీ పురంకు మార్పు చేసిన వెంటనే మండల స్థాయి వివిధ శాఖల కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌తో సహా వివిధ కార్యాలయాలన్నీ కేవీబీపురంకు మార్పు చేశారని, కానీ ఎస్‌బీఐ బ్రాంచిని మాత్రం కోవనూరులోనే ఉంచారని తెలిపారు. కొంత కాలం తరువాత ఎస్‌బీఐ బ్రాంచి చోరీకి గురికాబడిందని శ్రీకాళహస్తి పట్టణంలో మంచినీళ్ళగుంట వద్ద ఎస్ఐబీ బ్రాంచిని శ్రీకాళహస్తి పట్టణంలో ఒక అద్దె భవనంలోకి మార్పుచేసి ఏర్పాటు చేశారన్నారు. కానీ కేవీబీ పురం మండలంలోని 29 పంచాయతీలకు ఆ బ్రాంచి సేవలు సుమారు 30 కి.మీకు వస్తే కాని అందుబాటులో లేదని వాపోయారు. కేవీబీపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పక్క భవనంలోకి ఎస్‌బీఐ బ్రాంచిని మార్పు చేయాలని ఎంపీ డా. మద్దెల గురుమూర్తి మండల ప్రజలు వినతిపత్రం అందజేశారు. కనీసం ఏటీఎంను కూడా ఏర్పాటు చేయలేదని వారు వాపోయారు. కావున కేవీబీ పురంలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ మండల జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి సోషల్ వర్కర్ పి.ఎం.భాస్కర్‌రెడ్డి, ఢిల్లీబాబు, జగదీష్, బాలాజీ, సుబ్రహ్మణ్యంరాజు, చంద్ర గౌరిశంకర్‌నాయుడు, దుర్గాశంకర్ నాయుడు, పరందాంరెడ్డి, అమరంబేడు శివరాంరెడ్డి, మండల మహిళ్యా సంఘం నాయకురాలు కె.నాగభూషణమ్మ, పి.దాసు, పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటమునిగి విద్యార్థి మృతి

రేణిగుంట, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలోని పెద్దేరు వంక వాగులో రేవంత్(17) నీటమునిగి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా... తిరుపతి లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 12 మంది విద్యార్థులు వారిలోని ఓ విద్యార్థి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడానికి బుధవారం మామండూరు అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. అంతా సందడిగా పుట్టిన రోజు వేడుకను జరుపుకున్నారు. వీరిలో నలుగురు విద్యార్థులు ఈత సరదాతో అడవిలోని పెద్దేరు వంక వాగులో దిగారు. ఈత రాకపోవడంతో ఇద్దరు విద్యార్థులు నీటమునిగారు. ఇది గమనించిన మిగిలిన విద్యార్థులు వారిని బయటకు తీశారు. వీరిలో రేవంత్ అనే విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి రుయాలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారతీయ జనతా పార్టీ వెంట దేశ ప్రజలు

చంద్రగిరి, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



యావత్ దేశ ప్రజలు భారతీయ జనతా పార్టీ వెంట నడుస్తున్నట్లు ఆ పార్టీ తిరుపతిపార్లమెంట్‌నియోజకవర్గకార్యాలయఇన్‌చార్జ్‌కె.వెంకముని తెలిపారు. గుజరాత్‌లోజరిగిన శాసనసభ సార్వత్రిక ఎన్నికలలో గురువారం వెలువడిన ఫలితాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో బిజెపి 153 స్థానాలలో చారిత్రాత్మక విజయంతో రుజువు చేసినట్లు తెలిపారు. గుజరాత్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంతోనే బిజెపిని 7వ పర్యాయం ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించినట్ల తెలిపారు. 2024 ఎన్నికలలో బిజెపి విజయంపై ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## భక్తులకు నిర్విఘ్నంగా అన్నప్రసాద వితరణ : ఇఓ ధర్మారెడ్డి

తిరుమల, డిసెంబర్ 8ప్రభాతవార్త ప్రతినిధి:

శ్రీనివాసుడి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తులకు రుచిగా శుచిగా అన్నప్రసాదాలు నిర్విఘ్నంగా జరగాలని టిటిడి ఇఓ ధర్మారెడ్డి ఆకాంక్షించారు. మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ అన్నప్రసాద భవనంలో గురువారం ఆయుధ పూజ జరిగింది, ఇక్కడ ఇఓ ధర్మారెడ్డిని అన్నప్రసాద విభాగం సన్మానించింది.

## గుజరాత్ ఫలితాలతో...బిజెపి శ్రేణుల సంబరాలు

తిరుపతి, డిసెంబర్ 8ప్రభాతవార్త:



గుజరాత్ ఎన్నికల ఫలితాల్లో బిజెపి అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతో గురువారం సాయంత్రం తిరుపతిలో బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ ఫలితాలతో ముందుగానే సంక్రాంతి పండుగ వాతావరణం కనిపిస్తోందని బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, చంద్రారెడ్డి, కట్టమంచి చంద్రబాబు, సుబ్రమణ్యం యాదవ్, అక్కినపల్లి మునికృష్ణయ్య యాదవ్, కవిత, భాస్కర్‌రాయల్ బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

## నిత్యాన్న ప్రసాదానికి చౌడేపల్లి వాసుల విరాళం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి చిత్తూరుజిల్లా చౌడేపల్లి వాసులు భూరి విరాళం అందించారు. గురువారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న నంబూరు నారాయణ చెట్టి కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి ఏడాది మార్చి 22న అన్నదానం నిర్వహించాలని కోరారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నన నారాయణ శెట్టి ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌ను కలసి విరాళం ఇవ్వాలని కోరారు. ఆయన నిత్యాన్న ప్రసాదం వివరాలను తెలిపారు. దాంతో ఆయన రూ.లక్ష విరాళాన్ని అందించారు. వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## సేంద్రీయ వ్యవసాయంపై దృష్టిసారించండి!

తొట్టంబేడు, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



రైతులు ఎరువులు, పురుగు మందులకు మోతాదుకు మించి వాడటం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటకు ఏదైనా తెగులు ఆశిస్తే పురుగు మందుల కంపెనీలకు చెందిన ప్రతినిధినో లేక డీలర్‌నో సంప్రదించడం వల్ల మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులను వాడాల్సిన పరిస్థితి వస్తున్నట్లు తెలిపారు. రసాయన ఎరువులకు స్వస్తిపలికి సేంద్రీయ వ్యవసాయంపై దృష్టిసారించాలని కోరారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడం, మరోవైపు మంచు ఎక్కువగా ఉండడంతో అన్నదాతలు ఎక్కువగా వరినాట్లు వేస్తున్నారని, వరిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామాల్లో పర్యటించి వారికి వివరిస్తున్నట్లు తెలిపారు. రైతులు పంటసాగుపై సరైన అవగాహన కలిగి ఉన్నప్పుడే పెట్టుబడిని తగ్గించినా మంచి దిగుబడులను సాధించే వీలు కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు డ్రమ్‌సీడర్, యంత్రాలతో వరినాట్లు వేస్తే పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం వరిపైరుకు ఆకుముడత తెగులు సోకుతోందని వ్యవసాయాధికారుల సూచనల మేరకు అన్నదాతలు పంటలకు పురుగుమందులు వాడాలని సూచించారు.

## తహశీల్దార్‌గా సుబ్రమణ్యం బాధ్యతల స్వీకరణ

తొట్టంబేడు, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



తొట్టంబేడు తహశీల్దార్‌గా ఐ.సుబ్రమణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన శ్రీకాళహస్తి తహశీల్దార్‌గా పనిచేశారు. అనంతరం బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో పనిచేశారు. ఇటీవల బదిలీల్లో భాగంగా తొట్టంబేడు తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తహశీల్దార్‌కు డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, పలువురు సిబ్బంది, విఆర్ఓలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో అన్నదాతల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## బాలురు, బాలికలు అందరు సమానమే!

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



బాలురు, బాలికలు అందరు సమానమే అని లింగ వివక్షత చూపరాదని అందరు సమానమే అని న్యాయవాది రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాళహస్తి మండలంలోని వాంపల్లి గ్రామంలోలింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేఖంగా జాతీయ స్థాయి ప్రచారంలోభాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, చట్టరీత్యా నేరమని తెలిపారు. చదువుకునే వయస్సులో వివాహాలు చేసుకోరాదని పిల్లలను సమానంగా చూడాలని లింగ వివక్షత చూడరాదని ప్రతి మహిళ దీనిపై దృష్టి సారించాలన్నారు. చట్ట ప్రకారం 18సంవత్సరాల వయస్సు నిండని అమ్మాయికి, 21సంవత్సరాలు నిండని అబ్బాయికి జరిగే వివాహాన్ని బాల్యవివాహంగా చెప్పవచ్చన్నారు. అనంతరం బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామాల్లో ఏసమస్య ఉన్నా న్యాయ సలహాలకు 15100 నంబర్‌కు ఫోన్‌చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం మాదవయ్య, శ్రీనివాసులు, మాధవయ్య, కమ్యూనిటీ కోఆర్డినేటర్, మరియు పారాలీగల్ వాలంటీర్లు, మహిళా సంఘాల సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలకు రూ.5లక్షలు కేటాయించాలి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



జగనన్న గృహాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలకు అప్పగించాలని, జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలకు వెంటనే ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి మురళీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80లక్షల రూపాయలు కనీసం బేస్‌మెంట్ నిర్మాణానికి కూడా సరిపోదని అన్నారు. లబ్దిదారుల అంచనాల ప్రకారం ఎనిమిది లక్షలు ఖర్చు అవుతోంద న్నారు. కనీసం ఐదు లక్షలు కూడా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. 32లక్షల మందికి ఇంటి స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించుకోలేక అప్పులపాలవుతున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు మంజూరు చేసిన టిడ్కో ఇళ్ళను తదితరులకు పంచకుండా జగన్‌రెడ్డి మొండివైఖరి ప్రదరిస్తున్నారని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాలగురవయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ కాలువలు తదితర మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసిరాజు, పట్టణ కార్యదర్శి రెడ్డికార్తీక్, నాయకులు గురవయ్య, రమేష్, అయ్యప్ప, రాజయ్య, సురేస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు..

శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



ఆదమరిస్తే అంతేసంగతులు అన్నట్లుగా మారింది పురపాలకశాఖ తీరు. పట్టణంలోని పానగల్ వద్ద ఉన్న ఎస్‌బిఐ స్కిట్ బ్రాంచి వద్ద మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ఈ మార్గం లో వెళ్ళే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీ ప్రాంతంలో ఉన్న ఈమార్గంలో పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు, బ్యాంకు వెళ్ళే ఖాతాదారులు ఎప్పుడు పడిపోతారో అన్న భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూతపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తిరుపతి డివిజన్

## హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

వడమాలపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త:



మండలంలోని పాదిరేడులో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ప్రపంచ బ్యాంకు బృందం పరిశీలించింది. టెలి మెడిసిన్‌కు సంబంధించిన ఫోన్ ద్వారా ఆరోగ్యం పరిస్థితులపై తెలిపిన వివరాలను కంప్యూటర్ద్వారాపరిశీలించారు. అలాగేరోజువారివివరాలు, కేంద్రంలోని 14 రక్త పరీక్షల రిజిస్టర్లను పరిశీలిం చారు. కేంద్రానికి వచ్చే రోగులు సంతృప్తి కరంగా ఆరోగ్యంతో వెళ్లేలా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంక్ టీం సభ్యులు సందేశ్, డీపీవో ప్రకాష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానం అమలు చేయండి

కేవీబీ పురం, డిసెంబరు 8 ప్రభాతవార్త:

రైతులు ప్రకృతి వ్యవసాయంపై పూర్తి అవగాహన చెంది ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానం అమలు చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిరత్నం తెలిపారు. మండల ట్రైనర్ జి.కల్పన అధ్యక్షతన కేవీబీ పురం మండలంలోని కొత్తూరు పంచాయతీలోరైతులతో, మహిళా గ్రూపు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీపీఎం మునిరత్నం హాజరై ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాసన్ ఎన్‌జీవో సంస్థకు చెందిన సురేష్, దామోధర్‌లు మహిళా గ్రూపు సభ్యులకు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానంపై మెలకువలపై వ్యాక్సినేషన్ పై శిక్షణ ఇచ్చారు. చిరు ధాన్యాలైన రాగి, సజ్జ, జొన్న, అరికెలు తదితర చిరు ధాన్యాల ద్వారా రకరకాలైన వంటకాలు తయారు చేసుకుని వాటిని స్వీకరిస్తే పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని వారు తెలిపారు. చిరు ధాన్యాలతో ఫైబర్ ప్రోటీన్స్ మినరల్స్ ఐరన్ కాల్షియం తదితర విటమిన్లు మెండుగా ఉంటాయని వీటి వలన రోగ నిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. అంతే కాకుండా ప్రాణాంతకమైన వ్యాధులు సైతందరి చేరమని ఈ సందర్భంగా సమావేశంలో డీపీఎం మునిరత్నంతో పాటు నాసిక్ ఎన్‌జీవో సిబ్బంది తెలిపారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయం ద్వారఆ తక్కువ పెట్టుబడితో 15 రకాలైన వంటలను ఇళ్ళ వద్ద, వ్యవసాయ పొలాల్లో పండించుకుని ఎక్కువ లాభం పొందవచ్చని డీపీఎం తెలిపారు. అర ఎకరా పొలంలో ప్రకృతి వ్యవసాయం నిబంధన ప్రకారం చేస్తే ఆరు లక్షల వరకు ఆదాయం పొందవచ్చని ఈ సందర్భంగా డీపీఎం తెలిపారు. సమావేశంలో ఎన్ఎఫ్ఏ శ్రీ లేఖ, ఎస్ఆర్ పిసుధారత్న, భాను, సిబ్బంది, రైతులు, మహిళ్యా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కేవీబీపురం, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో మునస్వామిరెడ్డి కుమారుడు చంద్రయ్య(58) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ సందర్భంగా చంద్రయ్యకు జ్వరం రావడంతో వెంటనే కాళహస్తి ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కొరకు ఎంజీఎం కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేసే లోపు చంద్రయ్య మృతి చెందాడని అక్కడి వైద్యులు తెలిపారు. అతనికి డెంగ్యూ జ్వరం ఉన్నట్లు ప్లేట్స్ పడిపోయినట్లు నిర్ధారించినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకి డెంగ్యూ జ్వరం తెలుసుకోక ఇలాంటి పరిస్థితి వచ్చిందని మృతుని కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చంద్రయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆదరణ కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ పులి లక్ష్మీనంద కుమార్, మండల వైసీపీ బీసీ సంఘం హరిబాబు, గ్రామ సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ అయ్యప్ప, టీడీపీ నాయకులు శివరావ్, రామానుంజలనాయుడు, మునస్వామియాదవ్, సర్పంచ్ పొన్నూరు సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మనీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నివాళులర్పించారు.

## అర్హులకు 90రోజులలో ఇంటిపట్టాలు పంపిణి చేయండి

తిరుపతిరూరల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



అర్హులుగా ఇండి ఇంకా ఇంటి పట్టాలు ఇంకా పొందని లబ్దిదారులు ఎవరైనా ఉంటే 90 రోజులలో పట్టాలు పంపిణి చేయాలని సి.సి.ఎల్.ఎ., స్పెషల్ సి.ఎస్.సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి నుండి సి.ఎస్.సాయిప్రసాద్ వీడియో కాన్ఫెరేన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుండి జె.సి. డి.కె.బాలాజీ పాల్గొన్నారు. స్పెషల్ సి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో లేకుండాతప్పులు లేకుండా 90రోజులలో ఇంటిపట్టాలను పంఫిణి చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించి అందిస్తున్న పట్టాదారు పాసుపుస్తకాల కోసం సంబంధిత పట్టాదారుల ఫోటోలను అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఈ-కెవైసి పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసులు, రీ సర్వేలో ఎంజాయిమెంట్ ఉన్నవారినే రికార్డు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటిపట్టాలకు సంబంధించి ఓవర్ రైటింగ్ ఉండరాదని సూచించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి జగనన్న భూ హక్కు - భూ రక్ష రీ సర్వేలో పూర్తయిన 69 గ్రామాలకు సంబంధించి పట్టాలను త్వరగా అందజేయాలన్నారు. ఇప్పటికే 53 గ్రామాలలో పూర్తయినట్లు అన్‌లైన్‌లో వివరాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసరావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు నింద్ర విద్యార్థి శ్యామ్‌సాయి ఎంపిక

నింద్ర, డిసెంబర్ 8 ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి పోటీలకు నింద్ర విద్యార్థి శ్యామ్‌సాయి ఎంపికైనట్లుగా నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు బి.శివయ్య తెలిపారు. పుత్తూరు యస్‌ఆర్‌యస్ క్రీడా మైదానంలో జరిగిన యు 17ఫుట్‌బాల్ యస్‌జియఫ్ సెలెక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 10వతేది నుండి 12వతేది వరకు వైయస్‌ఆర్ కడపజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా బిసి హస్టల్ విద్యార్థికి చెందిన శ్యామ్‌సాయి సెలక్టవడం పట్ల బిసి హస్టల్ వార్డన్ సురేష్‌బాబు, వ్యాయమ దర్శకలు సుబ్రమణ్యం, ఉపా ధ్యా యులు అబినందించి హర్షం వ్యక్తం చేసారు.

## బిజెపి పట్టణ అధ్యక్షుడు కాసరం రాజీనామా!

శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :

భారతీయజనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు కాసరం రమేష్ తన ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజీనామా లేఖను తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, మరియు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా. ఆనంద్ కుమార్‌కు తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరారు. అయితే రాజీనామా చేసిన అనంతరం కాసరం రమేష్‌తో పాటు మరికొందరు బిజెపి నాయకులు తెలుగుదేశంపార్టీలో నేడు హైదరాబాదులో ఉన్న బొజ్జల బృందమ్మ మరియు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయసమాచారం.

## నాణ్యతా ప్రమాణాలతో ఉపాధి పనులు : ఎపిఓ

రామచంద్రాపురం, డిసెంబర్ 8 ప్రభాతవార్త:



ఉపాధిహామీ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎపిఓ హంసవేణి కూలీలకు సూచించారు. గురువారం నెత్తకుప్పం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె తనిఖీ చేశారు. ఉద్యానవన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో అందించిన ప్రతి మొక్కను రైతులు సంరక్షించుకోవాలన్నారు. కూలీలకు గిట్టుబాటు ధర అందే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ స్థలాలు : డిపిటిఓ

తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలోని ఏపిఎస్ఆర్టీసికి పుత్తూరు, సత్యవేడు, వెంకటగిరి బస్ డిపోల నందు గల ఖాళీ స్థలాలను 15 ఏళ్ల కాల పరమితితో అద్దె ప్రాతిపదికన నిర్వహించుకోవడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపిఎస్ఆర్టీసీ.ఏపి.జిఓవి.ఇన్ అనే వెబ్‌సైట్ నందు తెలుసుకోవచ్చన్నారు. టెండర్లకు సంబంధించి ప్రి-బిడ్ సమావేశం నేడు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం నందు జరుగుతందన్నారు. ఆసక్తి గల వ్యాపారవేత్తలు ఈ ప్రీ-బిడ్ మీటింగ్‌కు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

***ఆర్టీసీ కార్గోలో బహిరంగ వేలం!***

తిరుపతి కార్గో పార్సిల్ కార్యాలయం నందు ఈనెల 14,15 తేదీలలో క్లెయిమ్ చెయ్యని, గుర్తించని, డెలివరీ తీసుకోని వివిధ రకాల వస్తువులకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జిఎల్‌పివి.సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి గల వేలంపాటదారులు సదరు బహిరంగ వేలంపాటలో పాల్గొవలసిందిగా ఆయన కోరారు.

## ఉపాధ్యాయులపై ఒత్తిడి వద్దు



రేణిగుంట, డిసెంబర్ 8 ప్రభాతవార్త:

ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం సర్పంచ్‌కు మంచి పద్ధతి కాదని విప్పమాను పట్టెడకు చెందిన రూపేష్ అన్నారు. రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామస్థుడు రూపేష్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అనవసరంగా వారిని మానసిక వేదన గురి చేసి అనారోగ్య పాలు చేశారని ఆరోపించారు. ఆయాను అనవసరంగా విధులకు రాకుండా చేశారన్నారు. పాఠశాలను అభివృద్ధి చేస్తున్న టీచర్‌ను సర్పంచ్ సస్పెండ్‌చేయాలని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. విద్యా కమిటీ చైర్మన్ తన అనుకూలమైన వారు కావడంతో రాజీనామా చేయించారన్నారు.

అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధం : **సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి**

బడిని గుడిలా భావించి అభివృద్ధి చేస్తున్నానని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి వివరణ ఇచ్చారు. బడిని స్వచ్ఛంద సంస్థ ద్వారా అభివృద్ధి చేస్తున్నానన్నారు. తనపై అవినీతి ముద్ర వేయడం మంచి పద్ధతి కాదన్నారు. తన గురించి అందరికి తెలుసునన్నారు. ఎవరు ఎలాంటి వారో అందరికి తెలుసనన్నారు. అవినీతిని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తెలిపారు.

# తుఫాను ఎదుర్కొవడానికి పక్కా ప్రణాళిక

- ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు
- అందరికి అందుబాటులో వుండేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, డిసెంబర్ 8 ప్రభాతవార్త: జిల్లాపై మాండూస్ తుఫాను తీవ్ర ప్రభావం చూపనున్న నేపథ్యంలో ఈ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొండానికి జిల్లా నుండి మండల స్థాయి వరకు అధికారులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మాండూస్ తుఫాను నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ నుండి కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్‌ఓ రాజశేఖర్‌లతో కలసి జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో మాండూస్ తుఫాను ప్రభావం ఈ నెల 11వ తేదీ వరకు వుంటుందని, ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకొని సహాయక చర్యలను చేపట్టాలన్నారు. విపత్తు సమయాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో వుండి సహాయక చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే తుఫాను సమయంలో నిర్వర్తించాల్సిన విధులకు సంబంధించిన చెక్ లిస్టును అధికారులు, సిబ్బందికి పంపించడం జరిగిందని ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన మంచినీరు, భోజన వసతి, ఇతర కనీస వసతులను ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాల్లోని నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసి మంచినీటి వసతిని ఏర్పాలు చేసుకోవాలన్నారు. అలాగే భోజన ఏర్పాట్ల కోసం ఎఫ్‌పి షాపులు, ప్రభుత్వ గోడౌన్ల నుండి అవసరమైన మేరకు నిత్యావసర వస్తువులను తెచ్చుకొని అందుబాటులో వుంచుకోవాలన్నారు. అలాగే అత్యవసర వైద్య సేవల నిమిత్తం అవసరమైన మెడికల్ షాపులు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పబ్లిక్ హెల్త్ వర్కర్లతో సమన్వయం చేసుకొని మున్సిపల్ కమీషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, డివిజన్ పంచాయతీ అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. తుఫాను సహాయక చర్యల నిమిత్తం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అందుబాటులో వుంటాయని కలెక్టర్ తెలిపారు. అలాగే తుఫాను పరిస్థితుల్లో జిల్లాలో పశువులకు నష్టం వాటిల్లకుండా వాటిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**తుఫాను సన్నద్ధతకు చురుగ్గా ఏర్పాట్లు :**

మాండూస్ తుఫాను సన్నద్ధత ఏర్పాట్లను చిత్తూరు నగర పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చురుగ్గా చేపట్టారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రజలకు 24 గంటలకు అందుబాటులో వుండేవిధంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. వర్షాలకు వృక్షాలు కూలిన సమయంలో సత్వరం అక్కడి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి అవసరమైన ట్రీ కట్టర్లు, తాడులు, ఇతర సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది సమకూర్చుకొంది. అలాగే లోతట్టు ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తించడానికి అవసరమైన రైన్ కోట్లు, తాడులను సిద్ధం చేశారు. అలాగే ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం మున్సిపల్ ప్రజారోగ్య విభాగం సిబ్బందిని సిద్ధం చేసింది. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నీటిని తొలగించడానికి వీలుగా ఆయిల్ ఇంజన్ మోటర్లు, జెసిబిలు, లేడర్, జనరేటర్, వైర్ రోప్స్‌ను సిద్ధం చేశారు. వర్షాలతో ఎక్కడైనా ఇబ్బంది వుంటే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 08572-232745 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాల్సి వుంది.

**నీవానదిలో ప్రవాహానికి అడ్డంకులు తొలగించడానికి చర్యలు:**

మాండూస్ తుఫాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు అయితే నీవా నదిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం వుండటంతో వరద ప్రవాహానికి ఏ మాత్రం అడ్డంకులు లేకుండా చేయడానికి మున్సిపల్ అధికారులు నడుం బిగించారు. నీవా నదిలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వుండేవిధంగా మున్సిపల్ అధికారులు గురువారం జెసిబిలతో నదిలో అక్కడ అక్కడ వున్న అడ్డంకులు తొలగించడంతో పాటు నీవా నదిలో పూడిత తీసే పనులకు శ్రీకారం చుట్టారు.

## ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాలి



తిరుపతిరూరల్, డిసెంబర్ 8 ప్రభాత వార్త: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రశ్నించాలని తిరుపతిరూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు, చంద్రగిరి టిడిపి ఇన్‌చార్జి పులివర్తి నాని ఆదేశాల మేరకు గురువారం తిరుపతి రూరల్ వేమూరులో పార్టీ శ్రేణులతో కలిసి 'ఇదేం ఖర్మ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ వైకాపా అధికారంలోకి వచ్చాక వ్యక్తిగతదూషలు, దాడులు ఎక్కువైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. వైకాపా ప్రభుత్వ కక్ష్యపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతి హెచ్చుమీరాయని, భూఆక్రమణలు, కబ్జాలు ఎక్కువైనాయన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరగాయని, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవన శైలి కష్టతరమైందన్నారు. టిడిపి ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత వైకాపా ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైకాపా ప్రభుత్వ హయంలో గంజాయి, డ్రగ్స్ మత్తుపదార్థాలతో యువత పెడద్రోవపడుతున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీలు, గ్యాస్, బస్సు చార్జీలు పెరిగాయన్నారు. అభివృద్ధి అంతా టిడిపి హయంలోనే జరిగిందని, త్రాగునీటి సౌకర్యం అప్పుడే బాగుండేదని స్థానికులు తెలిపారు. కరెంట్ నిరంతరాయంగా ఉండేదని, రోడ్లు కూడా టిడిపి ప్రభుత్వ హయాంలోనే బాగున్నాయని తెలిపారు. రాజధాని అమరావతి ఉంటే బాగుంటుందని, మూడు రాజధానులు వద్దని స్థానికులు అంటు న్నారన్నారు. ఆంధ్ర రాజదాని ఏది అంటే జవాబు చెప్పేలేని అమోమయం స్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. ఇప్పటికైన ప్రజలు ఆలోచన చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే స్థిరమైన, నిలకడగా ఉండే ప్రభు త్వానికి పట్టం కట్టాలన్నారు. టిడిపి నాయకులు అమిలిని మధు, చెరుకూరి మధు శేఖర్, సుబ్బానాయుడు, వెంకట సుబ్బానాయుడు, డియస్.నాయుడు, మునిరాజ, మునిశేఖర్, శ్రీధర్ నాయుడు, సురేంద్ర నాయుడు, ముని హేమంత్, హేమలత, ముంతాజ్ బేగం, సుబ్బు యాదవ్, జనార్ధన్‌రెడ్డి, మునిరత్నం, మునికృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, కత్తి సుధాకర్, సుబ్బు యాదవ్, సురేష్‌నాయుడు, రాంజీ, ధనంజయయాదవ్, కిశోర్‌కుమార్, సురేష్, యుగంధర్‌లు పాల్గొన్నారు.

## తడకుప్పాల జాలర్లు ఎక్కడి వాళ్లక్కడే



తడ, డిసెంబర్ 8 ప్రభాతవార్త: మాండూస్ తుపాన్‌ను ఎదుర్కొనేందుకు తిరుపతి జిల్లా అధికారులు బంగాళాఖాతం, పులికాట్ సరస్సు తీరంపై దృష్టి కేంద్రీకరించారు. గురువారం తడ మండల అధికారులను మరోసారి అప్రమత్తం చేశారు. ఇక్కడి రెవెన్యూ, అభివృద్ధి, మత్స్యశాఖ అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీల వద్దకు వెళ్లి తుపాను ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి చలిగాలులతో పాటు చిరు జల్లులు కూడా మొదలు కావడంతో తుపాను ప్రభావం మొదలైందని భయపడుతున్నారు. శుక్ర, శనివారాల్లో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా పులికాట్ తీరంలో జాలర్లు తమతమ కుప్పాల్లోనే ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఇరకం దీవి వంటి ప్రాంతాల్లో ఎక్కువమంది ప్రభుత్వ సిబ్బంది నేరుగా జాలర్లకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సెల్‌ఫోన్ సమాచారం వంటివి కాకుండా మండల స్థాయి అధికారులు ముందుగానే జోక్యం చేసుకొని వివిధ శాఖల సిబ్బందిని ఈ దీవికి పంపించారు. ప్రస్తుతం తడ పడవల రేవుల్లో బోట్లు సమూహంగా కనిపిస్తున్నాయి. వేటకు వెళ్లిన జాలర్లు అంతా తిరిగి తమ తమ కుప్పాలకు చేరుకున్నట్లు అధికారులకు సమాచారం అందింది.

## ప్రజా సమస్యలు పట్టించుకోని వైసిపి ప్రభుత్వం : గాలి భానుప్రకాష్



పుత్తూరు, డిసెంబరు 8 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతుంటే వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ ఆరోపించారు. గురువారం ఆయన గేట్‌పుత్తూరులోని ఏడో వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గేట్‌పుత్తూరు నుంచి పట్టణంలోకి వెళ్లే మార్గాన్ని రైల్వే అధికారులు మూసివేయడం వల్ల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే అధికారులు అండర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిల రిజర్వేషన్ తగ్గించి సబ్ ప్లాన్ రద్దు చేసి ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, రైతులకు భరోసా లేదని, మద్యపాన నిషేధం హామీకి దిక్కులేదని తెలిపారు. ఈ ఖర్మ పోవాలంటే తెలుగుదేశం పార్టీని ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు ధనపాల్, డి.ఎస్.గణేష్, కరుణాకరన్, సోము, ఇళయరాజా, అన్బు తదితరులు పాల్గొన్నారు.

## 15న రాజగోపుర కలశ స్థాపన... నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన

కాణిపాకం, డిసెంబర్ 8 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో ఈనెల 15న రాజగోపుర కలశ స్థాపన, నూతన జీవ ధ్వజస్థంభ స్థాపన, సంప్రోక్షణ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. ఈనెల 14 నుండి 15 వరకు ఈకార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు ఈనెల 14న ఉదయం అనుజ్ఞ, గోపూజ, గంగపూజ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహావాచనం, రక్షా బంధనము, అచార్యాది రుత్విక్వరణం, కర్మాంగ స్నపనము, అర్చన, నివేధన, నీరాజన శాత్తుమురై, తీర్థ ప్రసాద వినియోగం వుంటుందని తెలిపారు. అలాగే సాయంత్రం 5 గంటలకు వాస్తుపూజ, వేదపారాయణ, శ్రీవిష్ణు సమస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీవివ్వక్సే నారాదన, మృత్సంగ్రహణం, అంకురా రోపణము, అగ్నిప్రతిష్ట, సం ప్రోక్షణ, చతుస్థానార్చన, ఆదివాసములు, ఆదివా సహోమం, శయనాధివాసము కార్యక్రమములను శాస్త్రోక్తంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. అలాగే 15న 8 గంటలకు న్యితకైంకర్యము, యాగశాల ఆరాధన, చతుస్థానార్చన హోమం, న్యాస హోమం, ముఖల, శిఖర కుంభ, తత్తమ్మార్తి మంత్రహోమం, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, మహాకుంభ సంప్రోక్షణ, శ్రీస్వామివారికి విశేషారాధన, నివేధన, తీర్థ ప్రసాద వినియోగం, యజమాన మహాశీర్వచనములు జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు.

## పుణ్యక్షేత్రంలో దోమల మోత!

-విషజ్వరాలతో తల్లడిల్లుతున్న జనాలు -ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట



శ్రీకాళహస్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త : స్వచ్ఛ భారత్ సాధిద్దాం, స్వచ్ఛ శ్రీకాళహస్తిగా తీర్చి దిద్దు దాం.. అన్న మాటలే తప్ప చేతల్లో పురపాలకశాఖ అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. దీంతో పుణ్యక్షేత్రంలో దోమలు మోతతో ప్రజలు, భక్తులు తల్లడిల్లుతున్నారు. గత పదిరోజులుగా కురిసిన వర్షాల కారణంగా దోమలు ప్రబలుతున్నాయి. పురపాలక సంఘంలోని మురికి వాడల్లో అయితే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు, చిన్నా, పెద్ద, తేడా లేకుండా జ్వరాల బారిన పడి ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీనికి తోడు ప్రైవేటు క్లినికల్ ల్యాబ్‌ల ముందు రక్తపరీక్షలకోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇక దోమల బాధ అంటారా విపరీతంగా మారింది. పగలు రేయి తేడా లేకుండా ఝుమ్మని సంగీతాన్ని వినిపిస్తున్నాయి. దోమల బాధతో జనం విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు.'ఎలుకకు ప్రాణ సంకటం పిల్లి చెలగాటమన్నట్లు' పాలకుల పరిస్థితి మారింది. జనం దోమల బాధతో తల్లడిల్లుతున్న కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదంటే ప్రజారోగ్యంపై పురపాలక అధికారులకు ఎంతమాత్రం శ్రద్ద ఉందో అర్థమవుతుంది.

**మురికివాడల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నం:**

శ్రీకాళహస్తి పట్టణంలో దోమలబాధ విపరీతమైంది.జనం విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. దోమలు ఈగల్లా మారాయి. పగలు రేయి తేడా లేకుండా సంగీతాన్ని వినిపిస్తున్నాయి. ఓ వైపు ఎటు చూసినా ప్రజలు విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మానేశారు. వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నట్లు చెబుతున్నారు కానీ ఆచరణలో ఏమి జరగటం లేదు. ఒక వేళ ఫాగింగ్ చేసినా నాలుగుమాడావీధులకే పరిమితం అవుతున్నారు. గతంలో డెంగ్యూజ్వరాలు వచ్చి చిన్నారులు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా ఫాగింగ్‌చేశామన్నట్లు జరిపి పరికరాలను మూలపడేశారు. పట్టణంలోని మురుగునీటి కాలువలు పురాతనకాలం నాటివి. ఇప్పటికే నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి గ్రామంలో నివాసం ఉంటున్న ఓవ్యక్తికి మలేరియా పాజిటివ్ వచ్చింది. ఇక సాయిబాబాగుడి సమీపంలో ఉన్న ఓ చిన్నారికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యి చెన్నైలో చికిత్స పొంది ఇంటికి చేరుకుంది. ఇక జ్వరం వచ్చిందంటే పట్టణంలోనిప్రైవేటు ఆస్పత్రులు ఫుల్‌గా రోగులతో నిండిపోతున్నాయి. ఓవైపు మలేరియా, టైఫాయిడ్, మరోవైపు డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రిలో ఎక్కువగా పరీక్షలు చేసుకునే వారికి డెంగ్యూ పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యింది. మరి అధికారులు ఏం చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దే!



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 8 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన డ్రగ్స్,గంజాయి అక్రమ మార్గాల్లో సరఫరా చేస్తున్న వివిధ చిత్రాలను ప్లకార్డుల ద్వారా చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి వాడకం,అక్రమ రవాణాలో దేశంలోనే మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన నివేదికలో ఉండటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించడం మాని,వారిని మత్తుకు బానిసలు చేయడానికి ఈ డ్రగ్స్,గంజాయిలను సిఎం జగన్ ప్రోత్సహిస్తున్నాడని దుయ్యబట్టారు.దీనికి ఉదాహరణ తాజాగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వారు జరిపిన దాడుల్లో 18 వేల కిలోలకు పైగా పట్టుబడిన గంజాయే సాక్ష్యమన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని, చదువుకుంటున్న వారికి ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వలేని,రాష్ట్రానికి పెట్టు బడులు తేలేని,ఆదాయం సృష్టించడం తెలియక కేవలం అప్పులపై ఆధార పడుతూ కనీసం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని చేతగాని,చేవలేని దద్దమ్మ సిఎం ఈ జగన్‌రెడ్డి అని ఛీత్కరించారు.ఈ పెద్దమనిషి సిఎం అయిన నాటి నుండి రాష్ట్రానికి పరిశ్రమలు తేకపోయినా,తన పార్టీకి చెందిన వారితో డ్రగ్ మాఫియాను సృష్టించి రాష్ట్రంలో యదేచ్ఛగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ యువత జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈనెల 14 వతేదీ 175 నియోజక వర్గాలలో యువత,విద్యార్థులలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చే వరకు తెలుగు యువత చేస్తున్న పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి మధుబాబు, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణయాదవ్,నాయకులు వెంకటేష్‌రెడ్డి,డిజె.ప్రసాద్,శ్రీరామ్,సంతోష్ రాయల్, లోకేష్,సుభాష్,శివ,దిలీప్ రాయల్,గణేష్,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష భేటీ అనంతరమే ఆక్రమణల తొలగింపు

- వైసీపీ నేత నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి



కోట, డిసెంబర్ 8 ప్రభాతవార్త : కోట పంచాయతీలోని కోట అడ్డరోడ్డు నుంచి కొత్తచెరువు వరకు ఆక్రమణల తొలగింపునకు ఇటీవల ఆకస్మికంగా అధికారులు నోటీసులు జారీచేయడం తగదని, అఖిలపక్ష భేటీ అనంతరమే ఆక్రమణల తొలగింపు జరుగుతుందని వైసీపీ నాయకులు నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కోటలో ఆక్రమణల తొలగింపునకు అఖిలపక్షం ఏర్పాటు చేస్తామని తెలిపారని గుర్తు చేశారు. ఈ అఖిలపక్షంలో స్థానిక ఎమ్మెల్యే వరప్రసాదరావు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, వ్యాపారులు, పంచాయతీ ఇఓ అందరూ కలిసి సంయుక్తంగా ఒక అవగాహనతో ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆ నాడు చెప్పడం జరిగిందని రాజేంద్రకుమార్‌రెడ్డి గుర్తు చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల అఖిలపక్షం భేటీ ఆలస్యమైందని, ఇంతలోనే హడావుడిగా వ్యాపారులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలు తొలగించాలనడం భావ్యం కాదన్నారు. కోవూరులో ఆక్రమణల తొలగింపునకు అఖిలపక్షం ఏర్పాటు చేసినట్లుగానే కోటలో కూడా అఖిలపక్షం ఏర్పాటు చేసిన అనంతరమే ఆక్రమణల తొలగింపు ఉంటుందని, అంతవరకు వ్యాపారులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి ఒత్తిళ్లకు లొంగాల్సిన అవసరం వ్యాపారులకు లేదన్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు నిధులు మంజూరైన వెంటనే అవసరమైన మేరకు ఆక్రమణల తొలగింపు ఉంటుందని ఆయన అన్నారు.

## ప్రతిరైతుకు ఈక్రాప్ తప్పనిసరి : ప్రసాద్‌రావు



నాయుడుపేట రూరల్, డిసంబరు 8 ప్రభాతవార్త ; వ్యవసాయసాగు చేపట్టిన ప్రతిరైతుకు ఈక్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు అధికారులను ఆదేశించారు.ఆయన గురువారం నాయుడుపేట వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిదిలోని పెళ్ళకూరు, చిట్టమూరు, కోట, వాకాడు, ఓజిలి మండలాల వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాద్‌రావు మాట్ల డుతూ ఈక్రాప్‌నమోదు చేపట్టేటప్పుడు ఎలాంటి అవకతవకలకు తావ్వికుండ జాగ్రర్తలు తీసుకోవాల న్నారు. ఆర్‌బికెల ద్వార ఎరువులు రైతులకు సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను ప్రతి రైతుకు అందించాలన్నారు. అనంతరం పిఎమ్‌కిసాన్, ఈకెవైసిలపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈసమావేశంలో నాయుడుపేట, ఎవొ గణేష్,పెళ్ళకూరు ప్రవీణ,చిట్టమూరు సుచేంద్రకుమార్,కోట నిరంజన్,వాకాడు దీప తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం సిఎం అజెండా : ఎమ్మెల్యే



గుడిపాల, డిసెంబర్ 8 ప్రభాతవార్త: అభివృద్ధి, సంక్షేమం అజెండాలతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంను ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. వసంతాపురం పంచాయతీలో గురువారం స్థానిక సర్పంచ్ రజనీ కాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా! లేదా! అని ప్రజలకు అడిగి తెలుసు కొన్నారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, ఆర్‌ఐ వంశీకృష్ణ, చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు రెడ్డప్ప, సునీంద్రారెడ్డి, మొగిలిరెడ్డి, సిమ్మాన్, సిలంబరసన్, రవీంద్రారెడ్డి, ఇతర వైకాపా నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గేటు పుత్తూరు ప్రజలు... గేటు దాటలేకపోతున్నారు

పుత్తూరురూరల్, డిసెంబరు 8 ప్రభాతవార్త: నగరి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో పుత్తూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గేటు పుత్తూరు పట్టణంలోని ద్రౌపదమ్మగుడి ఎదురుగా ఉన్న దారిని రైల్వే అధికారులు మూసి వేయడం వలన గేటు పుత్తూరు ప్రజలు పరిస్థితి ఇప్పుడు ఎవరు వెళ్ళకూడదని పూర్తిగా అడ్డుకట్ట వేయడంతో పట్టణంలోకి రాలేకపోతున్న గేటు పుత్తూరు వాసులు, విద్యార్థులు, గర్భవతులు, ఉద్యోగస్తులు, ఇక్కడ అధిక సంఖ్యలో వీవర్స్ ఇబ్బందులు లేకుండా వుండేది. దీనిపై స్పందించి బీజేపీ నాయకులు గేటుపుత్తూరు వాసులు పుత్తూరు పట్టణానికి రైల్వే లైన్ దాటడానికి అనుమతి ఇవ్వాలని, మార్గం రెడీ చేసి ఇవ్వమని పుత్తూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నాయకుడు గుప్త నారాయణస్వామినాయుడు, స్టేట్ కౌన్సిల్ మెంబరు వేలాయుధం, జిల్లా ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, రమేష్ నాయుడు, జిల్లా ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబరు శంకర్, జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు, జిల్లా టీచర్‌సెల్ మెంబరు మేకల సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు రామచంద్రరాజు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు గురు గణేష్, బీజేపీ పుత్తూరు మండలం ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి మునస్వామి, గోపి, సీనియర్ నాయకులు కార్తీక్, వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పట్టిన ఖర్మ ఎప్పుడు పోతుందో!

- మాజీ మంత్రి అమరనాధరెడ్డి



బంగారుపాళ్యం, డిసెంబర్ 8 ప్రభాత వార్త: ఈ రాష్ట్రానికి పట్టిన ఖర్మ ఎప్పుడు పోతుందో! అని ప్రజలు ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇదేమి ఖర్మరా! పోస్టర్‌ను బంగారుపాళ్యంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి టిడిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని ఆరోపించారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నిత్యం పీడిస్తున్నారని చెప్పారు. మద్యపాన నిషేధం చేపడుతామని చెప్పిన సిఎం వైఎస్ జగన్ ఎన్నికల అనంతరం మద్యం రేట్లను ఇష్టానుసారంగా పెంచారని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్ర ప్రజలు మద్యం కోసం ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని ఆ రాష్ట్ర ఆదాయం పెంపుకు పరోక్షంగా సిఎం వైఎస్ జగన్ సహకరిస్తున్నారని ఆరోపించారు. అలాగే రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రాష్ట్ర టిడిపి అధిష్టానం పిలుపు మేరకు ఇదేం ఖర్మరా కార్యక్రమానికి అధినేత చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, టిడిపి నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, వంశీచౌదరి, ధరణికుమార్, విక్రమ్, లోకనాధనాయుడు, హేమచంద్రనాయుడు, రాజేంద్రనాయుడు, జాకీర్, కొండేటి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక, మట్టి అక్రమ రవాణా ఆపడం ఎవరి తరం..?



చంద్రగిరి, డిశంబబర్ 8 ప్రభాతవార్త: చంద్రగిరి మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను ఆపడం ఎవరితరం కాదనే వాదన సర్వత్రా వ్యక్తమ వుతున్నది. నాలుగు రోజుల క్రితం పిచ్చినాయుడుపల్లి సమీపంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి ఏకంగా వీఆర్‌ఓపై భౌతికదాడికి పాల్పడటంతో పాటు మొబైల్‌ను లాక్కుని దిక్కున్నచోట చెప్పుకోమంటూ హెచ్చరించడం అతని బరితెగింపును వెళ్ళడిస్తున్నది. అయితే ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వినబడుతున్నాయి. మండలంలో ఇసుక, మట్టి టిప్పర్లు, జెసిబిలు, ట్రాక్టర్లతో యధేచ్ఛగా తరలిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదిలా వుండగా గురువారం తొండవాడ పంచాయతీ, ఆగ్రహారం సమీపంలో స్వర్ణముఖీనదిలో ఇసుక అక్రమంగా తరస్తున్నట్లు సమాచారం అందుకున్న తహశీల్దార్ శిరీషా తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకోవడంతో ఇసుక అక్రమార్కులు పారిపోయారు. దీంతో వంకలోకి వెళ్ళడానికి దారిలేకుండా ట్రెంచ్ కొట్టించారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవంటూ తహశీల్దార్ హెచ్చరించారు.

## శిక్షణ పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది!

-ఆర్టీసీ కడప జోన్ ఇడి గోపినాథ్‌రెడ్డి హర్షం



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 8 ప్రభాతవార్త: స్థానిక ఏపిఎస్‌ఆర్టీసీ అలిపిరి బస్ డిపోలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ నందు ఇప్పటివరకు 16 బ్యాచ్‌ల విద్యార్థులు తమ శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం గర్వంగా ఉందని ఆర్టీసీ కడప జోన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం అలిపిరి డిపో నందు శిక్షణ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ 17వ బ్యాచ్ విద్యార్థులకు ఆయన డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు, ఇన్‌ఛార్జ్ డిపో మేనేజర్ టి.బాలాజి లతో కలిసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలోనే కాక ఇతర దేశాల్లో సైతం డ్రైవర్లకు బాగా డిమాండ్ ఉందని,కావున ప్రతి ఒక్కరు ఏకాగ్రతతో డ్రైవింగ్ నేర్చుకోవాలన్నారు.డ్రైవింగ్ నేర్చుకున్నంత మాత్రాన అది గొప్ప కాదని,ప్రొఫెషనల్ డ్రైవర్‌లాగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎలాంటి చోట్ల బస్సును ఎలా చాకచక్యంగా నడపాలో క్షుణ్ణంగా వివరించారు.ఆఖరుగా ఆయన మాట్లాడుతూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయడం చాలా ముఖ్యమని సూచించారు.తరువాత ఇన్‌ఛార్జ్ డిఎం బాలాజి మాట్లాడు తూ ఈనెల 10వ తేదీ నుండి 18వ బ్యాచ్‌కు అప్లికేషన్లు ఇవ్వడం జరుగుతుం దన్నారు. ప్రతి బ్యాచ్‌కు కేవలం 16 సీట్లు మాత్రమే ఉంటాయన్నారు.శిక్షణ తీసుకునే వారికి రోజుకు గంట పాటు వాహనంలోని వివిధ భాగాలు,వాటి పనితీరు,రోడ్లపై ఉండే పెయింటింగ్ మార్క్స్,రోడ్డు పక్కన ఉన్న సైన్ బోర్డులు,సిగ్నల్ బోర్డుల గురించి క్షుణ్ణంగా విశదీకరిస్తామన్నారు.ప్రతి ఒక్కరిచే రోజుకు 15 కిలో మీటర్ల మేర డ్రైవింగ్ నేర్పిస్తామన్నారు.ఆసక్తి గలవారు స్కూల్ కో-ఆర్డినేటర్ రాము(సెల్ నెంబర్ 73828824541)ను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

## గాండ్ల మండపం ఆధునీకరణకు శ్రీకారం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పురాతన కాలం నాటి మండపాలను ఆధునీకరించుటకు జీర్ణోద్ధారణ కార్యక్రమాలను యువకుడైన చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శ్రీకారం చుట్టారు. గురువారం ఎన్‌టిఆర్ నగర్‌లోని స్వామి అమ్మవార్ల విడిది చేసే గాండ్ల మండపం శిధిలావస్థకు చేరుకుంది. ఈ మండపాన్ని శివరాత్రి లోపల బాగు చేయటానికి ఛైర్మెన్ దేవస్థానం అధికారులకు ఆదేశించారు. వారి పురాతన కాలం నాటి మండపాలకు కొత్త శోభ కల్పించాలని మరో వంద సంవత్సరాలు శాశ్వతంగా ఉండాలని భావించారు. దాంతో ఆయన గాండ్ల సంఘంతో చర్చించారు. గురువారం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మొట్టమొదట గాండ్ల కుల సంఘం ముందుకు రావటం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమాల్లో గాండ్ల కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు, గౌరవాధ్యక్షులు గురుదశరదన్, శ్రీకాలహస్తి నియోజకవర్గ గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు బిఎం రాజేంద్ర ప్రసాద్, కన్నావరం రవికుమార్, కళత్తూరు కుమార్, చంద్ర,హరిబాబు,సంఘం పెద్దలు చెంచయ్యశెట్టి, ఆర్ముగం, పాండుశెట్టి, నింద్ర గోవిందరాజులు,బుజ్జి, శరవణకుమార్, భరత్‌కుమార్, లీలాకుమార్,గుణ తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్స్‌లో నగరి క్రికెట్ జట్టు



నగరి, డిసెంబరు 8 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా శాఖ నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాల్లో నగరి క్రికెట్ జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. గురువారం కర్నూలులో జరిగిన క్రికెట్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కడప జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లాకు చెందిన నగరి జట్టు గెలుపొందింది. కడప జిల్లా జట్టు తొలుత 20 ఓవర్లలో 129 పరుగులు చేయగా, నగరి జట్టు 16.3 ఓవర్లలో 132 పరుగులు చేసి విజేతగా నిలిచింది. జట్టులో వెంకటేష్ (31), పవన్ కుమార్ (29) పరుగులు చేశారు. ఇమ్రాన్ (27) పరుగులు, కార్తీక్ మూడు వికెట్లు తీసి ప్రతిభ కనపరిచారు. శుక్రవారం నిర్వహించే ఫైనల్ పోటీలో నగరి జట్టు తిరుపతి జిల్లా క్రికెట్ జట్టుతో పోటీపడుతుందని కోచ్ బాబు తెలిపారు.